మానేరు జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
30.5.2026 శనివారం Saturday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 32 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## క్వాలిఫయర్-2లో రాజస్థాన్ ఓటమి






## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం

## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

వారిని కఠినంగా శిక్షించి తీరుతాం
విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

.. వివరాలు 3లో



## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

వారు కూడా మనుషులే అని గుర్తించాలి
లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి
సుప్రీం కోర్టు స్పష్టీకరణ

.. వివరాలు 3లో




# ఎమ్మెల్యేల తీరుపై సీఎం రేవంత్ అసంతృప్తి

పార్టీని, ప్రభుత్వాన్ని వదిలి సొంత ప్రచారంతో సరి..
చేద్దామనుకున్న కార్యకర్తలనూ చేయనివ్వడం లేదు
పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి చురకలు..
పార్టీ నేతలంతా ఎస్ఐఆర్‌కు సిద్ధంగా ఉండాలి
మంత్రులూ డ్యూటీలు వేసుకుని పనిచేయాలి..
నాకూ ఒక నియోజకవర్గం కేటాయించండి
ఈ నెల రోజులూ పార్టీకేసమయం కేటాయించాలి..
కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ



**జనతా న్యూస్, హైదరాబాద్ :** కొంత మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు జమీందార్లు లెక్క వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో వారియర్ల లెక్క పని చేశారని గుర్తు చేశారు. ఇప్పుడా కార్యకర్తలను ఎమ్మెల్యేలు కొందరు తమ వ్యక్తిగత ప్రచారానికే పరిమితం చేస్తున్నారని తప్పుబట్టారు. ఎమ్మెల్యే కూర్చుంటే, నిలబడితే, టెంకాయ కొడితే ఫొటోలు తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేయడానికే కార్యకర్తలను పరిమితం

మిగతా 2 లో




## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

03

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

## రైతు డిస్కమ్‌పై బహిరంగ విచారణ

ఈఆర్‌సీ వేదికగా అధికార, విపక్షాల బల ప్రదర్శన..
కొన్ని ప్రాంతాల్లో అమలు చేసి చూడండి: కవిత
వాడేది తక్కువే అయినా 24 గంటలు ఇవ్వాలి: కోదండరెడ్డి
రాష్ట్రమంతా పర్యటించి అభిప్రాయం తీసుకోవాలి: నిరంజన్‌రెడ్డి
కలిపే నిర్వహిస్తే కొత్త డిస్కమ్ ఎందుకు? వేణుగోపాల్


03

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన రైతు డిస్కమ్‌కు లైసెన్స్ ఇవ్వాలని అధికార పార్టీ, ఇవ్వరాదని విపక్షాలు డిమాండ్ చేశాయి. తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఆర్‌పీడీసీఎల్)కు పంపిణీ లైసెన్స్ మంజూరు చేయాలంటూ దాఖలైన దరఖాస్తుపై శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో బహిరంగ విచారణ జరిగింది. ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్, సభ్యులు కంచర్ల రఘు, చెరుకూరి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో విచారణ సాగింది. రైతు డిస్కమ్ లైసెన్స్ విచారణ అధికార, విపక్షాల మధ్య బల ప్రదర్శనగా మారింది.

## కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం
ప్రధాని మోదీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు


03



03

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం


రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లలో మాదే రికార్డు
ఇప్పటికే 60 లక్షల టన్నులు కొనుగోలు చేశాం
ఏపీ 24, తమిళనాడు 12, మహారాష్ట్రలో 3 లక్షల టన్నులే సేకరణ
రైతులకు ఈ నెల 28 నాటికి రూ.11,050 కోట్లు చెల్లించాం
వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. సేకరణ టార్గెట్‌ను కేంద్రం ఏటా తగ్గిస్తోంది
బీజేపీ నేతలు కల్లాల చుట్టూ తిరిగే బదులు ఢిల్లీకి వెళ్లి టార్గెట్ పెంచాలి
బీఆర్ఎస్ హయాంలో టార్గెట్‌లో ఎన్నడూ 50శాతం మించి కొనలేదు
పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
ఎమ్మెస్పీ ప్రకటించి వదిలేస్తే.. పంటనంతా ఎవరు కొనాలి?: తుమ్మల



02


04

## హోర్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తేస్తున్నాం

ఇరాన్‌తో ఒప్పందం దాదాపు ఖరారైంది: ట్రంప్ ప్రకటన

హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ నౌకాశ్రయాలపై తాము కొనసాగిస్తున్న దిబ్బంధనాన్ని త్వరలోనే ఎత్తివేయ బోతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతంలో మోహరించిన తమ యుద్ధ నౌకలను ఉపసంహరిస్తామని శుక్రవారం తెలిపారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
శనివారం 30 మే 2026



# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు : మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే29 :** పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,మే29 :** తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని

విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

## జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి

**హైదరాబాద్,మే29 :** రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

# గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

## సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్,మే29 :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ఃతిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. ఃష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

# ఎమ్మెల్యేల తీరుపై సీఎం రేవంత్ అసంతృప్తి

మొదటి పేజీ తరువాయి




చేస్తున్నారని చెప్పారు. వారిని ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రచారం చేయనివ్వడం లేదని కుండబద్దలు కొట్టారు. రాహుల్‌గాంధీ, టీపీసీసీ చీఫ్, సీఎం ఇచ్చిన సందేశాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలను ఆ ఎమ్మెల్యేలు పట్టించుకోవట్లేదని, ఆయా ఎమ్మెల్యేల వ్యక్తిగత కార్యక్రమాలను ప్రచారం చేస్తున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా తనకు సమాచారం ఉందని తెలిపారు. సహజంగా ఎమ్మెల్యేలతోనే కార్యకర్తలకు పనులు ఉంటాయి కాబట్టి.. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడానికి వారు ఆసక్తి చూపట్లేదన్నారు. ఆయా ఎమ్మెల్యేలు ఈ తీరు మార్చుకోవాలని, ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు సోషల్ మీడియాలో కార్యకర్తలతో విస్తృతంగా ప్రచారం చేయించాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలకు సోషల్ మీడియాను ఎలా వినియోగించుకోవాలో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు(పీఏసీ), సలహా కమిటీల ఉమ్మడి సమావేశంలో పార్టీ సోషల్ మీడియా ఎన్నికల ముందు పని చేసినట్లుగా అధికారంలోకి వచ్చాక పనిచేయట్లేదంటూ పలువురు సభ్యులు ఫిర్యాదు చేయగా ముఖ్యమంత్రి స్పందిస్తూ ఎమ్మెల్యేలకు చురకలు అంటించారు. ఎన్నికల కమిషన్ జూన్ నెలలో తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన కార్యాచరణపైన చర్చించేందుకు జరిగిన ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, రెండు కమిటీల సభ్యులు పాల్గొన్నారు. తొలుత ఎస్ఐఆర్‌తో పాటుగా పలు అంశాలపైన సభ్యులంతా తమ అభిప్రాయాలు వినిపించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహనను ప్రజాప్రతినిధులు పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గతంలో బూత్ ఎన్ రోలర్ల సాయంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ చేయించగలిగామని, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదులో కీలక పాత్ర పోషించిన ఎన్‌రోలర్ల సేవలను ఎస్ఐఆర్ విషయంలోనూ తీసుకోవాలని సూచించారు.

### డ్యూటీలు వేసుకుని పనిచేయాలి

డిజిటల్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించి నిరంతరం పర్యవేక్షించామని, ఎస్ఐఆర్ పర్యవేక్షణకూ అదే తరహాలో 119 నియోజకవర్గాలు, 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించాలని టీపీసీసీ చీఫ్‌కు సూచన చేశారు. ప్రతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తప్పనిసరిగా ఆయా నియోజకవర్గాలకు అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. వారు సరిగా పనిచేస్తే అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చునని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు నియోజకవర్గాల వారీగా డ్యూటీలు వేసుకుని పని చేయాలని స్పష్టం చేశారు. వారానికి ఒకరోజు చొప్పున నెలలో నాలుగు రోజులు ప్రభుత్వ పనులకు సెలవు పెట్టి పార్టీ పనులపై వారు దృష్టి పెట్టాలని చెప్పారు. తనకూ ఒక నియోజకవర్గం కేటాయించాలని, తానూ నెలలో నాలుగు రోజులు పార్టీకి సమయం కేటాయిస్తానని అన్నారు. ఎస్ఐఆర్ పర్యవేక్షణ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడి సలహాలు, సూచనలు తీసుకోవాలని నేతలను కోరారు. ఊర్ల నుంచి వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ పర్యవేక్షణలో పార్టీ నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళితేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళతారని చెప్పారు. నామినేటెడ్ పోస్టులను దాదాపుగా భర్తీ చేశామని, మిగిలిన వాటినీ చేసేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### హైదరాబాద్‌లో సన్నద్ధత పేలవంగా ఉంది

ఎస్ఐఆర్‌కు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో నాయకుల సన్నద్ధత చాలా పేలవంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని 15 నియోజకవర్గాల నాయకులతో ఒకేసారి సమావేశం పెడితే జరిగింది చూశామని, అలా కాకుండా 15 నియోజకవర్గాల్లోనూ ఈ అంశంపైసమావేశాలు పెట్టాలని ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచన చేశారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఎస్ఐఆర్‌పైన మహిళా కాంగ్రెస్.. క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని సూచన చేశారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పేరుతో బెంగాల్‌ను టార్గెట్ చేసిన బీజేపీ తర్వాత లక్ష్యంగా పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలను ఎంచుకుందని అన్నారు. డీసీసీ అధ్యక్షులు స్థానిక నేతలతో సమన్వయం చేసుకుని బీఎల్‌వోల జాబితాలను పంపాలని కోరారు. శనివారం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్లకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు కేటాయించనున్నారు.

### కార్యకర్త హ్యాపీగా లేడు: పలువురు సభ్యుల స్పష్టీకరణ

పార్టీ కోసం పదేళ్లు కష్టపడి నష్టపోయిన అనేక మంది కార్యకర్తలు అంత హ్యాపీగా లేరంటూ ఎంపీ రేణుకాచౌదరి, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు అభిప్రాయపడ్డారు. నష్టపోయిన కార్యకర్తలను ఆదుకోవాలని, త్వరితగతిన నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మొదటి నుంచీ కాంగ్రెస్‌లో ఉన్న నాయకులకు పదవుల భర్తీలో అన్యాయం జరుగుతోందని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని రేణుకాచౌదరి అన్నారు.

# అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

**తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లలో మాదే రికార్డు**

**ఇప్పటికే 60 లక్షల టన్నులు కొనుగోలు చేశాం**

**ఏపీ 24, తమిళనాడు 12, మహారాష్ట్రలో 3 లక్షల టన్నులే సేకరణ**

**రైతులకు ఈ నెల 28 నాటికి రూ.11,050 కోట్లు చెల్లించాం**

**వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. సేకరణ టార్గెట్‌ను కేంద్రం ఏటా తగ్గిస్తోంది**

**బీజేపీ నేతలు కల్లాల చుట్టూ తిరిగే బదులు ఢిల్లీకి వెళ్లి టార్గెట్ పెంచాలి**

**బీఆర్ఎస్ హయాంలో టార్గెట్‌లో ఎన్నడూ 50శాతం మించి కొనలేదు**

**పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**ఎమ్మెస్పీ ప్రకటించి వదిలేస్తే.. పంటనంతా ఎవరు కొనాలి?: తుమ్మల**



**హైదరాబాద్, మే 29 :** ప్రస్తుత సీజన్‌లో దేశంలో అత్యధిక మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసింది తెలంగాణ ప్రభుత్వమేనని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుచేస్తే... ఏపీలో 24 లక్షలు, తమిళనాడులో 12 లక్షలు, మహారాష్ట్రలో 3 లక్షలు, కేరళలో 2 లక్షల టన్నులు మాత్రమే సేకరించారని చెప్పారు. కేంద్రం అనుమతిచ్చిన దానికి మించి రూ.16,479 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిలతో కలిసి సచివాలయంలో మంత్రి ఉత్తమ్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ధాన్యం, బియ్యం సేకరణ కోటా కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. ఒకవైపు రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరుగుతుంటే.. కేంద్రం ఎఫ్‌సీఐ సేకరణ టార్గెట్‌ను ఏటా తగ్గిస్తోందని విమర్శించారు. బీజేపీ నేతలు కల్లాల చుట్టూ తిరిగేబదులు, ఢిల్లీకి వెళ్లి అదనపు కోటా తీసుకురావాలని సూచించారు. ధాన్యం సేకరణపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 8,575 సెంటర్లలో కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని, చివరి ధాన్యం గింజను కొనుగోలుచేసేదాకా సెంటర్లను తెరిచే ఉంచుతామని తెలిపారు.

### టార్గెట్‌కు మించి ధాన్యం కొనుగోళ్లు

రాష్ట్రంలో యాసంగిలో 141 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే, 75 లక్షల టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కేంద్రం కేవలం 52 లక్షల టన్నులకే అనుమతి ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 24 లక్షల టన్నులు కొనుగోలు చేస్తోందని వివరించారు. 13,000 వాహనాల్లో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారని, 2 లక్షల మంది సిబ్బంది అందుకోసం పనిచేస్తున్నారని వివరించారు. 2,008 రైస్‌మిల్లులు, 20.86 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీనాటికి రూ.11,050 కోట్లు రైతులకు చెల్లించినట్లు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కేకొంటామని అన్నారు. 60 లక్షల టన్నుల్లో 10 వేల టన్నులు తడిస్తే బాయిల్డు మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. ఇసుక, సిమెంటు లారీలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గత పాలకులు పదేళ్లలో ఏటా సగటున రూ.15 వేల కోట్ల ఎమ్మెస్పీ చెల్లిస్తే... తాము ఏడాదికి రూ.49 వేల కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం విధించిన టార్గెట్‌లో 50- 60 శాతమే కొనేవారని విమర్శించారు.

### ప్రజలు అసహ్యించుకునేలా బీజేపీ తీరు: తుమ్మల

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఇంగిత జ్ఞానంలేకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మండిపడ్డారు. వాస్తవాలు వక్రీకరించి, ప్రజలు అసహ్యించుకునేలా బీజేపీ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పంజాబ్, హరియాణా తదితర రాష్ట్రాల్లో పండిన పంటనంతా కేంద్రం కొనుగోలు చేస్తూ.. తెలంగాణ రైతులకు మాత్రం ద్రోహం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో మిగిలిన కోటి టన్నుల ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. మక్కలు క్వింటాలుకు కేంద్రం రూ.2,400 ఎమ్మెస్పీ ప్రకటించి వదిలేస్తే రైతులు రూ.1,400 - 1,500లకే అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు. కేంద్రం ఎమ్మెస్పీ ప్రకటించి చేతులెత్తేస్తే ఎవరు కొనాలని తుమ్మల నిలదీశారు. 11 లక్షల టన్నుల యూరియా కావాలని 3 నెలలుగా కోరుతుంటే.. 10 లక్షల టన్నులు ఇస్తామని చెప్పి, 5 లక్షల టన్నులు కూడా పంపలేదని విమర్శించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తమ సమావేశాలకు రైతులు రాకపోవటంతో బీఆర్ఎస్ నేతలు మిలిటెంట్ తరహా పోరాటాలకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల నుంచి ప్రజల దృష్టిని మళ్లించటానికే బీజేపీ రైతుగోస యాత్ర చేపట్టిందని విమర్శించారు. వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడితే.. అందుకు కేంద్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

**హైదరాబాద్,మే29 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు.

# రైతు డిస్కమ్‌పై బహిరంగ విచారణ

**ఈఆర్‌సీ వేదికగా అధికార, విపక్షాల బల ప్రదర్శన..**

**కొన్ని ప్రాంతాల్లో అమలు చేసి చూడండి: కవిత**

**వాడేది తక్కువే అయినా 24 గంటలు ఇవ్వాలి: కోదండరెడ్డి**

**రాష్ట్రమంతా పర్యటించి అభిప్రాయం తీసుకోవాలి: నిరంజన్‌రెడ్డి**

**కొత్త అప్పుల కోసమే ఈ డిస్కమ్: దొంతి**

**కలిపే నిర్వహిస్తే కొత్త డిస్కమ్ ఎందుకు? వే ణుగోపాల్**



**హైదరాబాద్, :** ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన రైతు డిస్కమ్‌కు లైసెన్స్ ఇవ్వాలని అధికార పార్టీ, ఇవ్వరాదని విపక్షాలు డిమాండ్ చేశాయి. తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఆర్‌పీడీసీఎల్)కు పంపిణీ లైసెన్స్ మంజూరు చేయాలంటూ దాఖలైన దరఖాస్తుపై శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో బహిరంగ విచారణ జరిగింది. ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్, సభ్యులు కంచర్ల రఘు, చెరుకూరి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో విచారణ సాగింది. రైతు డిస్కమ్ లైసెన్స్ విచారణ అధికార, విపక్షాల మధ్య బల ప్రదర్శనగా మారింది. వివిధ పార్టీల నాయకులు, అనుచరులు ఈఆర్‌సీకి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక ఏదో కుట్ర దాగుందని టీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. రూ.22 వేల కోట్ల లోటుతో, 42 శాతం విద్యుత్ అందించే బాధ్యతను బదలాయించారని, ఆ మేరకు ఉద్యోగుల బదిలీ జరగలేదని ప్రస్తావించారు. 1000 మందితో డిస్కమ్ ఎలా నడుస్తుందని ప్రశ్నించారు. ఒక్కో ఉద్యోగికి 600 ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయని గుర్తు చేశారు. 33 జిల్లాల్లో బహిరంగ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంలు రైతులతో చర్చలు జరపాలన్నారు. ఒక ప్రాంతాన్ని ప్రయోగాత్మకంగా తీసుకొని, అక్కడ విజయం సాధిస్తేనే రాష్ట్రమంతా విస్తరించాలని చెప్పారు. ఆంధ్రవాళ్ల చేతిలో విద్యుత్ సంస్థలున్నాయని ఆరోపించారు. అఖిలపక్ష సమావేశం పెట్టి, అసెంబ్లీలో చర్చించాలని కోరారు. రైతు డిస్కమ్ వచ్చాక ఎన్ని గంటల కరెంటు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు వాడుతున్నది నిజానికి 2-3గంటల కరెంటేనని, అయితే, 24 గంటల పాటు ఆ కరెంటు అందుబాటులో ఉండాలని తెలంగాణ వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రైతు డిస్కమ్‌ను సమర్థిస్తున్నామని చెప్పారు. రైతులకు బేడీలు వేసిన బీఆర్‌ఎస్ వారే రైతుల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వా త విద్యుత్ రంగాన్ని అప్పుల పాల్జేశారని ఆరోపించారు.

కాంగ్రెస్ ఉచిత విద్యుత్ ఇచ్చిందన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే లైసెన్స్‌పై ముందుకెళ్లాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. 2014లో ఎస్పీడీసీఎల్ ఏ గ్రేడ్‌లో, దేశంలో 9వ స్థానంలో ఉండేదని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని 52వ స్థానానికి దిగజార్చిందని చెప్పారు. ఎన్పీడీసీఎల్‌ను 16వ ర్యాంకు నుంచి 42వ ర్యాంకుకు దిగజార్చారన్నారు. 2014 లో రూ.1,595 కోట్ల బకాయిలు ఉంటే, రూ.31,698 కోట్లకు చేర్చారన్నారు. డిస్కమ్‌ల దౌర్భాగ్యానికి కారణం బీఆర్‌ఎస్సే అని మండలిలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. రైతు డిస్కమ్‌కు లైసెన్స్ ఇవ్వరాదని బీఆర్‌ఎస్ నేత నిరంజన్‌రెడ్డి కోరారు. విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్రమంతా పర్యటించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. 1000మంది ఉద్యోగులతో 30లక్షల మంది వినియోగదారుల సమస్యలెలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. డిస్కమ్ పాలక మండలి మొత్తం అధికారులే ఉండటం సరికాదని పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ప్రతినిధి దొంతి నర్సింహారెడ్డి అన్నారు. కొత్త అప్పులకోసమే ఈ డిస్కమ్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. 3 డిస్కమ్‌ల నిర్వహణ కలిసి కట్టుగా చేస్తే కొత్త డిస్కమ్ ఎందుకని విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాల్ ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయడం కాదు ఉన్న రెండు డిస్కమ్‌లను విలీనం చేయాలన్నారు.

### మోటార్లకు కాదు.. ట్రాన్స్‌ఫార్మర్లకే మీటర్లు: సీఎండీ

వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు పెట్టబోమని, కేవలం ట్రాన్స్‌ఫార్మర్లకు మాత్రమే మీటర్లు పెడతామని రైతు డిస్కమ్ సీఎం డీ ముషారఫ్ అలీ ఫారూఖీ స్పష్టం చేశారు. మరో రెండు వినియోగదారుల సమస్యల వేదికలు రైతు డిస్కమ్ పరిధిలో పెడుతున్నామని చెప్పారు. రైతు డిస్కమ్‌పై అభ్యంతరాలు/అభిప్రాయాలను తీసుకొని, నివృత్తి చేయాలని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ దేవరాజు నాగార్జున్ సీఎండీలను ఆదేశించారు.

### మాటల్లేవ్.. మాట్లాడుకోవడాల్లేవ్!

ఈఆర్‌సీ బహిరంగ విచారణకు బీఆర్‌ఎస్, టీఆర్‌ఎస్ నేతలు ఒకేసారి హాజరయ్యారు. ఈఆర్సీ కమిషన్ ఎదుట టీఆర్‌ఎస(తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూర్చోగా.. ఆమె పక్కన బీఆర్‌ఎసకు చెందిన మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి కూర్చున్నారు. వీరంతా చాలాసేపు అక్కడే కూర్చున్నా.. ఒకరిని ఒకరు పలకరించుకోలేదు. వాస్తవంగా.. ఈఆర్సీ విచారణకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావాల్సి ఉంది. అయితే సిరిసిల్లలోని వార్డు కౌన్సిలర్ పద్మ మరణించడంతో.. ఆయన సిరిసిల్లకు బయలుదేరి వెళ్లారు. ఒకవేళ కేటీఆర్ హాజరైనా పరిస్థితి ఇలాగే ఉండేదని, టీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కచోట ఉన్నా.. మాటల్లేవు.. మాట్లాడుకోవడాల్లేవంటూ.. సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు వెలిశాయి. ఈ అంశాన్ని రాజకీయ కోణంలోనూ విశ్లేషిస్తూ.. కవితకు అనుకూలంగా కొందరు, బీఆర్‌ఎసకు అనుకూలంగా కొందరు పోస్టులు పెట్టడం ఆసక్తి కలిగించింది.

# ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

### కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్,మే29 :** రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.



### కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

**రాజన్నసిరిసిల్ల,మే29 :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు. అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళు లర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ మృతి పట్ల బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ ఛైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ ఛైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# వివోలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్

### వివోల నిరవధిక దీక్షలకు బిఆర్ఎస్ మద్దతు

**నిజామాబాద్,మే29 :** ఎన్నికల హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కేసిందని, వీవోఏలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించి మోసం చేసిందని బీఆర్‌ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న వీవోఏల నిరవధిక సమ్మెకూ కోటగిరి మండల బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు బీఆర్‌ఎస్ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2023 లో అసెంబ్లీ సాక్షిగా నాటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏల సమస్యలపై ప్రశ్నించారని, ఆనాడు ప్రశ్నించిన సీతక్క ఇప్పుడు అదే శాఖ సంబంధించిన మంత్రి ఉన్నారని, ఆనాటి సమస్య నేడు గుర్తుకు రావడం లేదా అని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీవోఏలకు సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ట్యాబ్ తోపాటు నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీ లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి విశేష సేవలు అందిస్తున్న వివో ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల బీఆర్‌ఎస్ తరపున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

### 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం

### ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్,మే29 :** కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు లేవు

### 80శాతం ధాన్యం కుప్పల పేరుకున్నాయి

### బిజెపి భరోసా యాత్రలో అసలు విషయాలు గమనించాం

### సిఎం రేవంత్‌కు అధికారులప  పట్టు లేదన్న ఏలేటి

**హైదరాబాద్,మే29 :** రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా? అని రేవంత్ సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హమాలీల ఖర్చు రైతులే చెల్లిస్తున్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోమ్మని గత సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సందేహం వ్యక్తం చేశారు. గ్దదెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై నిప్పులు చెరిగారు. ఓటు బ్యాంకు కోసమే రైతులను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన

యూరియాను కూడా సక్రమంగా ఇవ్వకుండా.. యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వయసు మీరి, బుద్ధి మందగించిందని.. అందుకే బీజేపీని విమర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవుల కోసం, సూట్ కేసులు మోయడానికి కాంగ్రెస్ నేతలు ఢిల్లీ యాత్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల చర్చకు వస్తారా? అంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. బీజేపీ యాత్ర చేస్తే కాంగ్రెస్ ఎందుకు భయపడుతుందంటూ సందేహం వ్యక్తం చేశారు. వాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెట్రోల్, డీజల్‌పై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజల్‌పై 30 శాతం వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతు వడదెబ్బతో చనిపోతే మంత్రులు వెళ్లి పరామర్శించారా?.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించారా? అని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. సన్ ఫ్లవర్, శనగలు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల చెబుతున్నారని.. అందుకు సంబంధించిన కౌంటర్ ఎక్కడ పెట్టారో చూపించాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

# ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

### నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భమికి ఎసరు

### నకిలీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

**మేడ్చల్,మే29 :** ఫేక్ జీఓలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని తమదిగా చూపిస్తూ ఫేక్ జీఓలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఈ నకిలీ జీఓలను వైరల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం భూమిని క్రమబద్ధీకరించినట్లు చెబుతూ ఐదు ఫేక్ జీఓలను సృష్టించిన నిందితులు, ఆ భూమిని ఎకరాకు రూ.3.5 కోట్లకు అమ్మేందుకు కుట్ర చేసినట్లు సమాచారం. ఈ భూమి డీల్‌లో బొల్లా రమేష్, బ్రహ్మనాయుడుతో ఒప్పందం కుదిరినట్లు దర్యాప్తులో బయటపడింది. బొల్లా బ్రహ్మనాయుడుకు నిమ్మల కుటుంబం నుండి రెండు విడతలుగా డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఒకసారి కోటి రూపాయలు, మరోసారి 25 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. మొత్తం భూ లావాదేవీల్లో సుమారు నాలుగు కోట్లు చేతులు మారినట్లు దర్యాప్తులో తేలింది. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, బ్యాంక్ పాస్‌బుక్స్, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. చట్టబద్ధ హక్కులు లేకపోయినా ప్రభుత్వ పోరంబోకు భూమిపై హక్కులు ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. హైకోర్టులో తమ భూమే అని నిందితులు పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ, అక్టోబర్ 2025లో వాటిని కోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. అనంతరం కూడా అక్రమంగా భూమి అమ్మకానికి ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు. ఫేక్ జీఓలు, ఫోర్జరీ పత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. భూమి కొనుగోలు చేసే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.



# సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

## వారు కూడా మనుషులే అని గుర్తించాలి

### లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి : సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.

# హోర్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తేస్తున్నాం

### ఇరాన్‌తో ఒప్పందం దాదాపు ఖరారైంది: ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్ :** హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ నౌకాశ్రయాలపై తాము కొనసాగిస్తున్న దిబ్బంధనాన్ని త్వరలోనే ఎత్తివేయబోతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతంలో మోహరించిన తమ యుద్ధ నౌకలను ఉపసంహరిస్తామని శుక్రవారం తెలిపారు. ఇరాన్‌తో ఒప్పందం కొలిక్కి వచ్చిందని, త్వరలో అది అమల్లోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ట్రూత్ సోషల్‌లో ట్రంప్ శుక్రవారం సుదీర్ఘ పోస్టు పెట్టారు. 11 నెలల క్రితం ఇరాన్ అణు కేంద్రాలపై తమ బీ2 బాంబర్లతో దాడి చేసినప్పుడు శుద్ధిచేసిన యురేనియం అందులోనే ఉండిపోయిందని.. దానిని వెలికి తీసే సాంకేతికత ప్రపంచంలో అమెరికాకు, చైనాకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై ఇరాన్ వెంటనే స్పందించింది. తమ షరతులకు లోబడి మాత్రమే హోర్ము జ్ జలసంధి తెరుచుకుంటుందని స్పష్టంచేసింది. ట్రంప్ ప్రకటన సగం నిజాలు, సగం అబద్ధాలతో కూడి ఉందని విమర్శించింది. కాగా, ట్రంప్ ప్రభుత్వంలో తన పరపతిని పెంచుకొనేందుకు పాకిస్థాన్ ఓ ప్రైవేటు లాబీయింగ్ సంస్థతో 1.2 మిలియన్ డాలర్లకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. వాషింగ్టన్‌కు చెందిన ఇర్విన్ గ్రేవ్స్ స్ట్రాటజీ గ్రూప్‌తో నెలకు 50 వేల డాలర్ల ఫీజు చెల్లించేలా రెండేళ్ల కాలానికి అమెరికాలోని పాక్ రాయబార కార్యాలయం ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఒప్పందం ఈ నెల 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిందని తెలిసింది.


# శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

### 1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం

**తిరుమల :** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది.

# ఖుష్బూ దంపతుల కుమార్తె అవంతిక వివాహం

### ప్రధాని మోడీని కలిసి శుభలేఖ అందచేత



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీని సినీ నటి, భాజపా నేత ఖుష్బూ కుటుంబం శుక్రవారం దిల్లీలో కలిసింది. తమ కుమార్తె అవంతిక వివాహానికి ఆహ్వానిస్తూ.. ఖుష్బూ, సుందర్ సి దంపతులు శుభలేఖను అందజేశారు. వారితోపాటు అవంతిక, ఆమెకు కాబోయే భర్త శ్రవణ్ శ్రీనివాసన్ కూడా ఉన్నారు . ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు ఖుష్బూ. ప్రధానితో కలిసి దిగిన ఫొటోను కూడా షేర్ చేశారు. ‘బిజీ షెడ్యూల్‌లోనూ ప్రధాని మోదీ మాకు సమయం ఇచ్చినందుకు కృతజ్ఞులం. కాబోయే దంపతులను ఆయన ఆశీర్వదించారు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. థాంక్యూ మోదీజీ‘ అని పేర్కొన్నారు. ఖుష్బూ దంపతుల చిన్న కుమార్తె అయిన అవంతిక నటిగా మలయాళంలో ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆరంభం' అనే చిత్రంలో ఆమె యాక్ట్ చేస్తున్నారు. పెద్ద కుమార్తె ఆనందిత నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

### యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి

### విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు

### నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ :** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధాన మంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శ కాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానిం చింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుం టారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

### వారిని కఠినంగా శిక్షించి తీరుతాం

### విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ :** నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి,

వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు. 11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

# అక్రమ వలసదారులకు మమత చేయూత

### తృణమూల్ నేతలో ఊతకర్ర అందించిన వైనం

### సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు

కోల్‌కతా,మే29(ఆర్ఎన్ఎ): మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కనపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్ట్‌ల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు. ఇండియా టుడే కథనం మేరకు.. బంగ్లాదేశ్ తిరిగి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తున్న అక్రమ వలసదారులు మీడియాతో మాట్లాడుతూ దేశంలోకి ఎలా వచ్చారో చెప్పారు. కొంతమంది తాము నదులు దాటి భారత దేశంలోకి ప్రవేశించామని చెప్పారు. మరి కొంతమంది తాము మధ్యవర్తుల ద్వారా ఇండియాలోకి వచ్చామన్నారు. చీకటిలో సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించామని తెలిపారు. మధ్యవర్తుల సాయం ఉంటే 10 నిమిషాల్లో దేశంలోకి ప్రవేశించవచ్చని ఓ అక్రమ వలసదారుడు మీడియాకు తెలిపాడు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో పని చేసే కొంతమంది కార్యకర్తల సాయంతో తాము భారత దేశంలోకి వచ్చామని, వారే తమకు అన్ని డాక్యుమెంట్లు తయారు చేసి ఇచ్చారని వెల్లడించారు. డాక్యుమెంట్ల కారణంగా తాము భారత్‌లో పలు పథకాల ద్వారా డబ్బులు పొందామని, ఓట్లు కూడా వేశామని చెప్పారు. బంగ్లాదేశ్‌లోని కుస్తియా జిల్లాకు చెందిన ఓ కార్పెంటర్ మాట్లాడుతూ.. 'నేను ఇండియాలోకి రావడానికి మధ్యవర్తికి 7 నుంచి 8 వేల రూపాయలు ఇచ్చాను. ఆ మధ్యవర్తి బీఎస్ఎఫ్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటాడు. రాత్రి పూట బీఎస్ఎఫ్ సిబ్బంది లేని సమయంలో పెద్ద సంఖ్యలో జనాలను ఇండియాలోకి పంపుతాడు’ అని చెప్పాడు. తాను ఏజెంట్‌కు 20 వేల రూపాయలు ఇచ్చి భారత్‌లోకి వచ్చానని బెంగళూరులో ఉంటున్న ఓ అక్రమ వలసదారుడు మీడియాతో చెప్పాడు.

# పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం

### కల్తీ మద్యానికి 11మంది మృత్యువాత

### ఆందోళనకరంగా పలువురి పరిస్థితి

**పుణె :** మరోమారు కల్తీ మద్యం కాటేసింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం చోటుచేసుకుంది. పుణె, పింప్రి-చింఛ్వాడ్ జంట నగరాల్లో ఇప్పటివరకు 11 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ మృతిచెందారు.

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్నవారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అధికారికంగా అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే వెల్లడించారు. వీరిద్దరూ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పాగా

### పంజాబ్ స్థానిక ఎన్నికల్లో ఆప్ విజయభేరి

**ఛండీగఢ్ :** పంజాబ్ లోని అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించింది. 50 వార్డుల్లో 28 వార్డులు సొంతం చేసుకుంది. దీంతో అబోహర్‌లో బీజేపీ తొలిసారి మేయర్ పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 2027లో కీలకమైన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈ గెలుపు బీజేపీలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను శుక్రవారంనాడు ప్రకటించారు. బీజేపీ 28 వార్డులు గెలుచుకోగా, ఆప్ 20 వార్డులతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ ఒక స్థానం, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు.కాలిఫోర్నియా ఆఫ్ పంజాబ్'గా అబోహర్‌ను పిలుస్తారు. కిన్నో పండ్ల సాగు, బలమైన వ్యవసాయ ఆదాయం కలిగిన ప్రాంతమిది. ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి కలిగిన అర్బన్ సెంటర్లలో ఇదొకటి. ఈ ప్రాంతంలో ఓటర్ల మనోభావా లను తాజా ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని, 2027 ఎన్నికలకు ముందు ఇలాంటి ఫలితం వెలువడంతో ఆసక్తికరమని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 20 నగర పంచాయతీలకు మే 26న ఎన్నికలు జరిగాయి. మోహాలి, బటిండా, అబోహర్, బర్నాలా, కపుర్తాలా, మోగా, బటాలా, పఠాన్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల్లో 7.555 మంది పోటీ చేశారు. ఆప్, కాంగ్రెస్, బీజేపీ, సాద్‌తో పాటు బహుజన్ సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల చేదు అనుభవాలను చవిచూసిన ఆమ్ ఆద్మీ పార్టీ కు ఎట్టకేలకు ఊరట లభించింది. ఆప్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రమైన పంజాబ్‌లో ఈనెల 26న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు శుక్రవారంనాడు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో ఆప్ ఘనవిజయం సాధించింది. పంజాబ్‌లోని 102 నగర పాలక సంస్థలకు ఈ ఎన్నికలు జరుగగా, వీటిలో 8 మున్సిపాలిటీలు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 19 నగర పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1,869 వార్డులకుగాను శుక్రవారం రాత్రి వరకు వెలువడిన ఫలితాల్లో 939 వార్డులను ఆప్ కైవసం చేసుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో సగానికి పైగా వార్డులను దక్కించుకుంది. 376 వార్డుల్లో కాంగ్రెస్ గెలిచి రెండో స్థానంలో నిలిచింది. సాద్-189, బీజేపీ-167 స్థానాలు గెలుచుకున్నాయి. బీఎస్పీ 7 వార్డులు దక్కించుకుంది.పంజాబ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించడంపై 'ఆప్' నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు.

# క్వాలిఫయర్-2లో రాజస్థాన్ ఓటమి

## శతక్కొట్టిన శుభ్‌మన్
## ఆఖరాటకు టైటాన్స్
## పోరాడిన వైభవ్
## ఫైనల్లో గుజరాత్ టైటాన్స్




ముల్లన్‌పూర్: ఐపీఎల్-19వ సీజన్ ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104) అద్భుత శతకంతో ఆకట్టుకోగా.. శుక్రవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన క్వాలిఫయర్2లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్లతో నెగ్గింది. దీంతో మూడోసారి ఫైనల్లోకి అడుగుపెట్టిన గుజరాత్ ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఆఖరిపోరులో ఆర్‌సీబీతో తలపడనుంది. గత బుధవారం జరిగిన క్వాలిఫయర్స్ 1లోనూ ఈ రెండు జట్లే తలపడిన విషయం తెలిసిందే. ముందుగా రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ(47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96), జడేజా (35 బంతుల్లో 45 నాటౌట్), ఫెరీరా (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38 నాటౌట్) రాణించారు. హోల్డర్, రబాడలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 18.4 ఓవర్లలో 219/3 చేసి గెలిచింది. సాయి సుదర్శన్ (32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 58) రాణించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.

### ఓపెనర్ల జోరు:

భారీ ఛేదనలో గుజరాత్ తొలి ఓవర్ నుంచే అదరగొట్టింది. ఓపెనర్లు గిల్-సాయి సుదర్శన్ ఎదురుదాడికి రాజస్థాన్ బౌలర్ల దగ్గర సమాధానం లేకపోయింది. వీరి ధాటికి తొలి ఓవర్‌లోనే 19 రన్స్, ఆనక పవర్‌ప్లేలో జట్టు 69 పరుగులతో నిలిచింది. 26 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న సుదర్శన్ కాసేపటికే 13వ ఓవర్‌లో హిట్‌వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ తరహాలో అవుటవడం సాయికిది వరుసగా రెండోసారి. దీంతో తొలి వికెట్‌కు 167 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే ఫోర్‌తో గిల్ 47 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. ఆర్చర్ అతడిని ఎక్కువసేపు నిలువనీయలేదు. 15వ ఓవర్‌లో ఎల్బీగా వెనక్కిపంపాడు. అప్పటికి గుజరాత్‌కు 30 బంతుల్లో 33 రన్స్ అవసరమవడంతో ఇబ్బంది లేకపోయింది. సుందర్ (16) వేగంగా ఆడి 18వ ఓవర్‌లో వెనుదిరగాడు. అనంతరం తెవాటియా (17 నాటౌట్), బట్లర్ విజయలాంఛనాన్ని పూర్తి చేశారు.

### వైభవ్ నిలకడ:

టాస్ గెలిచిన రాజస్థాన్ మరో ఆలోచనలేకుండా బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఎలిమినేటర్ మ్యాచ్ మాదిరి వేగం ఈసారి కనిపించలేదు. పిచ్ మరీ బ్యాటింగ్‌కు అనుకూలించేలా కనిపించలేదు. దీంతో వైభవ్‌ను ఆది నుంచే చెలరేగకుండా గుజరాత్ పేసర్లు కట్టడి చేయగలిగారు. అయితే మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా వైభవ్ మాత్రం 18 ఓవర్లపాటు ఓపిగ్గా క్రీజులో పాతుకుపోయాడు. అతడికి జడేజా సహకరించగా, చివర్లో ఫెరీరా బాదుడుకు జట్టు కోలుకుంది. తొలి రెండు ఓవర్లలోనే ఓపెనర్ జైస్వాల్ (1)ను సిరాజ్.. జురెల్ (7)ను రబాడ అవుట్ చేయడంతో జట్టు 9/2 స్కోరుతో నిలిచింది. ఈ స్థితిలో బ్యాటింగ్ ర్డర్‌లో ముందుగా దిగిన జడేజాతో వైభవ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. ప్రసిద్ధ్ ఓవర్‌లో జడ్డూ 6,4,4తో పవర్‌ప్లేలో ఆర్ఆర్ 70/2 స్కోరుతో పటిష్టంగా నిలిచింది. అయితే 8వ ఓవర్ ముగిశాక జడ్డూ మోచేతి గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. పరాగ్ వచ్చీ రాగానే జోరు చూపినా హోల్డర్ తన వరుస ఓవర్లలో పరాగ్ (11)తో పాటు షనక (3)ను అవుట్ చేశాడు. 13వ ఓవర్‌లో ఆర్చర్ (7) వెనుదిరగ్గా.. 31 బంతుల్లో వైభవ్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. ఆర్చర్ అవుటయ్యాక తిరిగి జడేజా క్రీజులోకి వచ్చాడు. చివరకు 16వ ఓవర్‌లో వైభవ్ 4,6,4తో 16 రన్స్ సాధించగా, తర్వాత సుందర్ ఓవర్‌లోనూ రెండు సిక్సర్లు బాది సెంచరీ వైపు సాగాడు. కానీ కేవలం 4 పరుగుల దూరంలో వైభవ్ వరుసగా రెండో శతకాన్ని మిస్సయ్యాడు. 18వ ఓవర్‌లో రబాడ ఈ వికెట్ తీశాడు. దీంతో జడ్డూతో కలిసి మొత్తంగా 127 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక రషీద్ విసిరిన చివరి ఓవర్‌లో ఫెరీరా 4 సిక్సర్లతో విరుచుకుపడి 27 రన్స్ అందించగా..స్కోరు 200 దాటింది.

### స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) ప్రసిద్ధ్ (బి) సిరాజ్ 1, వైభవ్ సూర్యవంశీ (సి) ప్రసిద్ధ్ (బి) రబాడ 96, జురెల్ (సి) గిల్ (బి) రబాడ 7, జడేజా (నాటౌట్) 45, పరాగ్ (సి) రబాడ (బి) హోల్డర్ 11, షనక (సి) బట్లర్ (బి) హోల్డర్ 3, ఆర్చర్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 7, ఫెరీరా (నాటౌట్) 38, ఎక్స్‌ట్రాలు: 6, మొత్తం: 20 ఓవర్లలో 214/6; వికెట్ల పతనం: 1-2, 2-9, 3-101, 4-109, 5-118, 6-172; బౌలింగ్: సిరాజ్ 4-0-42-1, రబాడ 4-0-35-2, ప్రసిద్ధ్ 4-0-42-1, వాషింగ్టన్ 2-0-23-0, హోల్డర్ 4-0-27-2, రషీద్ 2-0-45-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (హిట్ వికెట్) (బి) బ్రిజేశ్ 58, గిల్ (ఎల్బీ) ఆర్చర్ 104, బట్లర్ (నాటౌట్) 9, వాషింగ్టన్ (సి) ఫెరీరా (బి) బర్గర్ 16, తెవాటియా (నాటౌట్) 17, ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 18.4 ఓవర్లలో 219/3; వికెట్ల పతనం: 1-167, 2-182, 3-201; బౌలింగ్: ఆర్చర్ 4-0-45-1, బర్గర్ 4-0-35-1, బ్రిజేశ్ 3.4-0-44-1, తుషార్ 3-0-34-0, యశ్‌రాజ్ 2-0-29-0, జడేజా 2-0-28-0.

# సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న పంత్




లక్నో సూపర్ జెయింట్స్ సంచలన ప్రకటన చేసింది. తమ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తికాక ముందే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు పంత్ నాయకత్వంలో ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాల్సిందిగా పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ అంగీకరిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది.లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తిగా ముగియకముందే.. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని ఆ ఫ్రాంఛైజీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఐపీఎల్ 2026లో పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ దారుణ ప్రదర్శన చేసింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో పంత్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు."లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా రిషభ్ పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి గొప్పగా సేవలందించాడు" అని లక్నో సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. వచ్చే సీజన్‌కు ముందు టీమ్‌ను పునర్నిర్మించడంపై తాము ఫోకస్ పెట్టినట్లు వెల్లడించింది.కాగా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కెరీర్ ఆరంభించిన రిషభ్ ఫంత్.. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అనూహ్యంగా ఆ జట్టును వీడాడు. దీంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వచ్చేశాడు. ఇతర జట్లతో పోటీ పడి మరి లక్నో సూపర్ జెయింట్స్.. రికార్డు ధర రూ.27 కోట్లు వెచ్చించి.. పంత్‌ను దక్కించుకుంది. వెంటనే కెప్టెన్‌ను చేసింది. అయితే కెప్టెన్‌గా, ఆటగాడిగా పంత్ పూర్తిగా విఫలమయ్యాడు.లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్ సారథ్యంలో గత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరకుండానే నిష్క్రమించింది. ఈ సీజన్‌లో అయితే ఇంకా దారుణ ప్రదర్శన చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. మొత్తంగా పత్ సారథ్యంలో లక్నో.. రెండు సీజన్లలో కలిపి కేవలం 10 మ్యాచ్‌లలో మాత్రమే గెలిచింది. మరోవైపు బ్యాటర్‌గా కూడా పంత్ విఫలమయ్యాడు. ఐపీఎల్ 2025లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది 312 పరుగులు సాధించాడు. దీంతో విమర్శలపాలయ్యాడు.

# ఇటలీ టెన్నిస్ స్టార్ జనిక్ సినర్‌కు భారీ షాక్

## రెండో రౌండ్‌లోనే ఓడిపోయి ఇంటిబాట



2026 ఫ్రెంచ్ ఓపెన్‌లో ఇటలీ టెన్నిస్ స్టార్ జనిక్ సినర్?కు భారీ షాక్ తగిలింది. అతడు రెండో రౌండ్?లోనే ఓడిపోయి ఇంటిబాట పట్టాడు. అగ్రశ్రేణి ఆటగాడు జనిక్ సినర్?ను 56వ ర్యాంకర్ జువాన్ మాన్యువల్ సెరుండోలో (అర్జెంటీనా) ఓడించి భారీ షాకిచ్చాడు. అతడు 3-6, 2-6, 7-5, 6-1, 6-1 తేడాతో ఇటలీ స్టార్‌ను ఓడించి కెరీర్‌లో చరిత్రాత్మక విజయం అందుకున్నాడు.అయితే ఈ మ్యాచ్?లో తొలి రెండు సెట్లలో సినర్‌దే ఆధిపత్యం. ఆరంభం నుంచే అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిన సినర్, మొదటి సెట్‌ను 6-3, రెండో సెట్?ను 6-2 స్కోర్లతో కైవసం చేసుకుని పోటీలో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించాడు. అయితే మైదానంలో ఎండ వేడి, కండరాల గాయాలు సినర్‌ను పూర్తిగా దెబ్బ కొట్టాయి. ఎండ వేడికి అతడు తట్టుకోలేకపోయాడు. అప్పుడే కండరాల నొప్పి కూడా ఎటాక్ చేయడంతో సినర్? ఆటపై దాని ఎఫెక్ట్ పడింది. ఈ అవకాశాన్ని ప్రత్యర్థి సెరుండోలో పూర్తిగా సద్వినియోగం చేసుకొని దూడుకుడా ఆడాడు. దీంతో ఆ తర్వాత వరుసగా మూడు సెట్లలో సినర్?ను ఓడించాడు.అయితే సినర్ ఓటమిపై క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ స్పందించాడు. అథ్లెట్లకు ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలుపుతూ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. "మనసు ముందుకు వెళ్లాలని కోరుకున్న సమయంలో, శరీరం సహకరించకపోతే ఆటలో నిస్సహాయులం అవుతాం. ఈ రోజు సినర్‌ను చూసి నేను జాలిపడ్డాను. ఎందుకంటే, ఇలాంటి పరిస్థితి ఎదురవ్వడం చాలా బాధాకరం. ఒక ఛాంపియన్ నిజమైన సత్తా ఎల్లప్పుడూ కమ్‌బ్యాక్ ఇవ్వడంలోనే ఉంటుందని గుర్తుంచుకోండి. అందుకే క్రీడలు ఎప్పుడూ అనూహ్యంగా, ప్రత్యేకంగా ఉంటాయి. ఈ మ్యాచ్‌లో జువాన్ మాన్యుయెల్ సెరుండోలో చివరి వరకు సంయమనం పాటిస్తూ, నమ్మకంతో ఉన్నాడు. తనకు లభించిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఆటలో విజయం సాధించాడు. అతడికి నా అభినందనలు" అని సచిన్ పేర్కొన్నాడు.కాగా, రీసెంట్‌గా సినర్ ఇటాలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకొని అరుదైన ఘనత సాధించాడు. గత 50 ఏళ్లలో ఇటాలియన్ ఓపెన్ గెలిచిన తొలి ఇటలీ పురుష ఆటగాడిగా సినర్ రికార్డు కొట్టాడు. ఆ జోష్‌లో ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగిన అతడు తొలి రౌండ్‌లో టబుర్‌పై 6-1, 6-3, 6-4 తేడాతో ఈజీగా నెగ్గి రెండో రౌండ్?కు అర్హత సాధించాడు. ఇక్కడా సునాయసంగానే నెగ్గేస్తాడని ఫ్యాన్స్ భావించగా అతడికి సెరుండోలో షాకిచ్చాడు.



# వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట

## ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి

ఏషియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పోటీపడే అంశంలో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నెల జరగనున్న ఆసియా గేమ్స్ ఎంపిక పోటీలలో (సెలక్షన్ ట్రయల్స్) పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు అనుమతి ఇచ్చింది. ఇంతకు ముందు వినేశ్ ఫొగాట్ ఆసియా గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనవచ్చంటూ దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ భారత రెజ్లింగ్ సమాఖ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తన పరిధిని మీరిందని, ఎంపిక ప్రమాణాల ప్రకారం వినేశ్ అనర్హురాలని పేర్కొంది. అయితే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌ను విచారించిన సుప్రీం దిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ స్థానంలో వేరొకరు ఉండి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని, కానీ వినేశ్ ఈ దేశాన్ని గర్వపడేలా చేశారని వెల్లడించింది. ఇప్పటికే ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు హైకోర్టు అనుమతి ఇచ్చిందన్న అత్యున్నత న్యాయస్థానం ఈ దశలో వినేశ్‌ను వెనక్కి వెళ్లమని చెప్పడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రస్తుతానికి ఈ విషయంలో తాము ఏం చేయలేమని ఆమె పోటీల్లో పాల్గొనవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐతే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌పై వినేశ్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి అంశాలకు పరిష్కారం కోర్టుల్లో కాకుండా వ్యవస్థల్లోనే ఉండాలని అభిప్రాయపడింది. క్రీడాకారులు, అధికారులు, సంస్థల మధ్య సమన్వయం బలంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించింది. "ఇలాంటి విషయాల్లో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమయంలో కోర్టులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సమతుల్యత పాటిస్తూ కఠిన నిర్ణయాలు తీసుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ నరసింహ మాట్లాడుతూ, "హైకోర్టు ఇప్పటికే అనుమతి ఇచ్చిన తర్వాత వినేశ్‌లో ఆశలు, అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆమెను ఇంటికి వెళ్లిపోమని చెప్పడం సరైంది కాదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు డబ్ల్యూఎఫ్ఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఏషియన్ గేమ్స్ అధికారులకు మే 14 నాటికే భారత క్రీడాకారుల పేర్లు పంపాల్సి ఉందని అన్నారు. అయితే ఆ గడువు ఇప్పటికే ముగిసిపోయిందని తెలిపారు. ఇది అంతర్జాతీయ సంస్థ పరిధిలో ఉండే అంశమని, భారత కోర్టుల పరిధిలోకి రాదని వాదించారు.అయితే వినేశ్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు, ఆమె డోపింగ్ పరీక్షలకు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 2024 డిసెంబరులో వినేశ్ కొంతకాలం విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించిందని ధర్మాసనం గుర్తుచేసింది. అనంతరం 2025 జూలైలో ఆమె తల్లి అయ్యారని, 2026 జనవరి 1 నుంచి తాను తిరిగి అర్హత పొందుతానని డబ్ల్యూఎఫ్ఐకి సమాచారం ఇచ్చిందని తెలిపింది. జనవరిలో నిర్వహించిన డోపింగ్ పరీక్షకు వినేశ్ హాజరు కాలేదని, తాను హరియాణా ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లాల్సి వచ్చిందనే ఆమె వివరణను అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) అంగీకరించలేదని ధర్మాసనం పేర్కొంది. వినేశ్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలు సాధించిన విషయం అంగీకరిస్తూనే, ప్రపంచ స్థాయి నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాల్సిందేనని జస్టిస్ నరసింహ స్పష్టం చేశారు."డోపింగ్ పరీక్షను మిస్ కావడం చిన్న విషయం కాదు. భారత క్రీడలు అంతర్జాతీయ క్రీడా వ్యవస్థతో అనుసంధానమై ఉన్నాయి. ప్రపంచ స్థాయిలో ఏదైనా అనర్హత వస్తే అది భారత ప్రతిష్ఠపై ప్రభావం చూపుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "మీరు డోపింగ్ పరీక్ష కోసం అవసరమైన వివరాలు ఇవ్వలేదు. తొలి పరీక్షను కూడా మిస్ అయ్యారు" అని కోర్టు పేర్కొంది. వినేశ్ తరఫున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, ఈ వ్యవహారం ఆమె మాతృత్వంతో ముడిపడి ఉందని, ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వాలని కోర్టును కోరారు.ఇదిలా ఉండగా మే 22న దిల్లీ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం వినేశ్ ట్రయల్స్‌లో పాల్గొనడానికి అనుమతి ఇచ్చింది. మాతృత్వ విరామం తర్వాత తిరిగి వస్తున్న వినేశ్ వంటి ప్రముఖ క్రీడాకారిణిని పరిగణనలోకి తీసుకునే వెసులుబాటు డబ్ల్యూఎఫ్ఐ ఎంపిక విధానంలో లేదని, అది వివక్షపూరితంగా ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. మహిళా క్రీడాకారిణుల మాతృత్వాన్ని వృత్తిపరమైన అడ్డంకిగా గానీ, లేదా వారికి ప్రతికూలంగా మారే పరిస్థితిగాగానీ చూడకూడదని కోర్టు నొక్కి చెప్పింది.అలాగే మే 30, 31 తేదీల్లో జరిగే ట్రయల్స్‌ను వీడియో రికార్డు చేయాలని డబ్ల్యూఎఫ్ఐకి ఆదేశించింది. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్), భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి స్వతంత్ర పరిశీలకులు కూడా హాజరుకావాలని హైకోర్టు పేర్కొంది. గతంలో ప్రముఖ క్రీడాకారుల ఎంపికలో కొంత వెసులుబాటు ఉండేదని, ప్రస్తుతం అమలు చేస్తున్న విధానం అందుకు భిన్నంగా ఉందని వ్యాఖ్యానించింది. మే 9న డబ్ల్యూఎఫ్ఐ జారీ చేసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్న కారణాలు ముందుగానే నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తున్నాయని, క్రీడా ప్రయోజనాలు, న్యాయం దృష్ట్యా వినేశ్‌కు అవకాశం ఇవ్వాల్సిందేనని హైకోర్టు పేర్కొంది.

# డెనిమ్ అవుట్ ఫిట్‌లో బుట్టబొమ్మ అందాలు!

అవకాశాలు లేకపోయినా సోషల్ మీడియా ద్వారా గ్లామర్ వలకబోస్తూ అందచందాలతో సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నారు సెలబ్రిటీలు. మరి కొంతమంది వరుస సినిమా అవకాశాలు అందుకుంటూ తమ సినిమా షెడ్యూల్స్ తో బిజీగా ఉన్నా అభిమానులను అలరించడానికి నిత్యం రకరకాల ఫోటోషూట్లతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. అలాంటి వారిలో బుట్టబొమ్మ అలియాస్ పూజా హెగ్డే కూడా ఒకరు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అలా వైకుంఠపురంలో అనే చిత్రంలో అల్లు అర్జున్ సరసన నటించి బుట్ట బొమ్మగా ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఒకప్పుడు తెలుగులో తన అందచందాలతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న పూజా హెగ్డే ఆచార్య, ఎఫ్ 3 చిత్రాల తర్వాత మళ్లీ తెలుగులో అవకాశాలు అందుకోలేదు. కానీ బాలీవుడ్, హాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన ఈమె తాజాగా హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటించింది. వరుణ్ ధావన్, మృణాల్ ఠాగూర్, పూజా హెగ్డే కలయికలో వస్తున్న ఈ సినిమా జూన్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో రమేష్ తౌరాణి నిర్మాణంలో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు కూడా భారీగానే ఉన్నాయి. రొమాంటిక్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా నుండి విడుదలైన పాటలు, గ్లింప్స్ , టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. అటు ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటు హీరోయిన్స్ కూడా సోషల్ మీడియా వేదికగా ప్రమోషన్స్ మొదలుపెట్టారు. అందులో భాగంగానే ఇలా గ్లామర్ ఫోటోషూట్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అలా బుట్ట బొమ్మ కూడా తాజా లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది.



# ఐవరీ చీరలో అప్సరసలా జాన్వీ.. 'పెద్ది' ప్రమోషన్లలో స్పెషల్ అట్రాక్షన్!

యువ నటి జాన్వీ కపూర్ తన రాబోయే చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా తన స్టైలిష్ లుక్స్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా ప్రత్యేకంగా రూపొందించిన ఐవరీ రంగు చీరలో ఆమె అచ్చం దేవకన్యలా కనిపించి ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకుంటూ, "హెలో ఫ్రమ్ యువర్ జాను పాపా" అంటూ సరదా క్యాప్షన్‌ను జోడించారు. సున్నితమైన ఎంబ్రాయిడరీతో, షీర్ ఫ్యాబ్రిక్‌పై డిజైన్ చేసిన ఈ చీరలో ఆమె అప్సరసను తలపించారు. ఈ చీరకట్టులో డ్రామాటిక్ కేప్-స్టైల్ పల్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జత చేసిన స్కాల్ప్‌డ్ లేస్ బోర్డర్లు సంప్రదాయానికి ఆధునికతను జోడించాయి. దీనికి మ్యాచింగ్‌గా హెవీ ఎంబ్రాయిడరీతో కూడిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ బౌజ్‌ను ధరించారు. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం తెరకెక్కుతోంది. ఈ యాక్షన్ డ్రామాకు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్ 4న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ వంటి నగరాల్లో జాన్వీ తన ఎథ్నిక్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో స్టైల్ చేసిన ఈ లేటెస్ట్ లుక్, ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.



# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.



## ఫైబర్ ఉండే స్నాక్స్ తింటే నిజంగానే మనకు మేలు జరుగుతుందా..

# నిపుణులు ఏం చెబుతున్నారు..?



ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్ వినియోగం పెరుగుతున్న వేళ శరీరానికి అవసరమైన ఫైబర్ లోపం కూడా పెద్ద సమస్యగా మారుతోంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో ఇప్పుడు ఫైబర్ కలిపిన స్నాక్స్ విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ ఫైబర్ నిజంగా ఆరోగ్యానికి ఉపయోగకరమా? లేక కేవలం మార్కెటింగ్ కోసమేనా? అనే సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిపుణులు ఫైబర్ ఫోర్టిఫైడ్ స్నాక్స్‌పై ఆసక్తికరమైన విషయాలు వెల్లడిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఫైబర్ బ్లూబెర్రీ వంటి సహజ ఆహారం నుంచి వచ్చినా, ఫైబర్ కలిపిన స్నాక్స్ నుంచి వచ్చినా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా దాన్ని దాదాపు ఒకే విధంగా గుర్తిస్తాయి. ఈ ఫైబర్ పేగుల్లో ఫెర్మెంటేషన్‌కు గురై షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇవి గట్ మైక్రోబయోమ్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రోజుకు అవసరమైన 30 గ్రాముల ఫైబర్‌ను తీసుకోలేని వారికి ఈ ఫైబర్ కలిగిన స్నాక్స్ కొంత మేర ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.

### సహజ ఫైబర్‌కు, కృత్రిమ ఫైబర్‌కు తేడా అదే..

అయితే సహజ ఆహారాల్లో లభించే ఫైబర్‌కు, ఫోర్టిఫైడ్ స్నాక్స్‌లో కలిపే ఫైబర్‌కు కొన్ని ముఖ్యమైన తేడాలు ఉన్నాయని కూడా వారు స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు పండ్లు లేదా బెర్రీలు తింటే కేవలం ఒక రకం ఫైబర్ మాత్రమే కాదు, పెక్టిన్, సెల్యులోజ్, హెమిసెల్యులోజ్, రెసిస్టెంట్ స్టార్చ్ వంటి అనేక రకాల ఫైబర్లు శరీరానికి అందుతాయి. వీటిలో ప్రతి ఒక్కటి వేర్వేరు విధుల్లో పనిచేస్తుంది. అంతేకాదు సహజ ఆహారాల్లో ఫైబర్‌తో పాటు పాలీఫినాల్స్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, సూక్ష్మ పోషకాలు కూడా లభిస్తాయి. ఇవన్నీ కలిసి గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమిష్టిగా పనిచేస్తాయి. కానీ ఫైబర్ కలిపిన స్నాక్స్ ఈ సహజ సమ్మేళనాన్ని పూర్తిగా అందించలేవని నిపుణులు చెబుతున్నారు.

స్నాక్స్ తయారీదారులు ఖర్చు, రుచి, నిల్వ సామర్థ్యం, వేడి తట్టుకునే గుణం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని పరిమిత రకాల ఫైబర్లనే ఉపయోగిస్తారని వివరించారు. అందుకే మార్కెట్‌లో లభించే చాలా ఫైబర్ స్నాక్స్‌లో ఇన్యూలిన్ అనే ఫైబర్ ను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది చికోరి వేర్ల నుంచి తీసుకునే ఫైబర్. ఇది తక్కువ ఖర్చుతో లభించడం, రుచి లేకపోవడం, వేడి తట్టుకోవడం వంటి కారణాలతో దీన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు.

### ఉపయోగకరమేనా..

ఇన్యూలిన్ అత్యుత్తమ ఫైబర్ కాకపోయినా కొంతమేర ప్రయోజనం అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ ఫైబర్ లోపాన్ని తగ్గించడంలో ఈ స్నాక్స్ ఉపయోగపడవచ్చని, కానీ ఇవి సహజ ఆహారాలకు పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కావని హెచ్చరిస్తున్నారు. అందువల్ల పండ్లు, కూరగాయలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలు వంటి సహజ ఫైబర్ వనరులను ఆహారంలో తప్పనిసరిగా కొనసాగించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. అయితే ఫైబర్ లోపాన్ని కొంతవరకు భర్తీ చేయడంలో ఫైబర్ ఫోర్టిఫైడ్ స్నాక్స్ కూడా సహాయకరంగా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## కరోనా అనంతరం చాలా మందికి వస్తున్న కొత్త ఆరోగ్య సమస్య.. బ్రెయిన్ ఫాగ్.. ఏంటిది..?

కరోనా మహమ్మారి తర్వాత చాలా మంది ఒక విచిత్రమైన మానసిక సమస్యను ఎదుర్కొంటున్నారు. పని చేస్తున్నప్పుడు, చదువుతున్నప్పుడు లేదా సాధారణ రోజువారీ పనులు చేస్తూ కూడా ఏకాగ్రత కోల్పోవడం, ఏదో మర్చిపోవడం, ఆలోచనలు స్పష్టంగా లేకపోవడం వంటి సమస్యలు ఎక్కువయ్యాయి. గదిలోకి ఎందుకు వెళ్లామో మరిచిపోవడం నుంచి మాట్లాడుతున్న విషయాన్ని మధ్యలోనే మర్చిపోవడం వరకు ఈ సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. నిపుణులు దీనిని బ్రెయిన్ ఫాగ్ గా పేర్కొంటున్నారు. కరోనా తర్వాత జీవనశైలిలో వచ్చిన మార్పులు, ఒత్తిడి, అధిక డిజిటల్ వినియోగం వంటి కారణాలతో ఈ సమస్య పెరిగిందని చెబుతున్నారు. లాక్‌డౌన్ సమయంలో ఉద్యోగాలు, చదువు, సమావేశాలు, స్నేహితులతో మాట్లాడటం అన్నీ ఆన్‌లైన్‌కే పరిమితమయ్యాయి. దీంతో రోజంతా స్క్రీన్‌ల ముందే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకేసారి అనేక పనులు చేయడం, వరుసగా నోటిఫికేషన్లు రావడం, నిరంతరం వర్చువల్ మీటింగ్స్‌లో పాల్గొనడం వల్ల మెదడుకు విశ్రాంతి దొరకలేదు. ఈ నిరంతర మానసిక ఒత్తిడి క్రమంగా ఏకాగ్రత తగ్గడానికి దారితీసిందని నిపుణులు చెబుతున్నారు.

### నిద్ర సమస్యలు..

పని, వ్యక్తిగత జీవితాల మధ్య గీతలు చెదిరిపోవడంతో నిద్రించే సమయాలు కూడా పూర్తిగా మారిపోయాయి. రాత్రిళ్లు ఆలస్యంగా మేల్కొని ఉండటం, తగిన నిద్ర లేకపోవడం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం దెబ్బతింటున్నాయి. తక్కువ నిద్ర కూడా నిర్ణయాలు తీసుకునే శక్తిని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా సమయంలో ఎదురైన ఆందోళన, ఒంటరితనం, భయం కూడా మెదడుపై తీవ్ర ప్రభావం చూపాయని చెబుతున్నారు. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా శరీరంలో కార్టిసోల్ అనే హార్మోన్ స్థాయిలు పెరిగి, జ్ఞాపకశక్తి, నేర్చుకునే ప్రక్రియకు సంబంధించిన మెదడు భాగంపై ప్రభావం చూపుతుందని నిపుణులు వివరిస్తున్నారు. దీని వల్ల విషయాలు గుర్తుంచుకోవడం కష్టమవడం, దృష్టి నిలకడగా లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

### చాలా కాలంగా లక్షణాలు..

కొంతమందిలో కరోనా సోకిన తర్వాత కూడా ఈ లక్షణాలు కొనసాగుతున్నాయి. దీన్ని లాంగ్ కోవిడ్ లక్షణాల్లో భాగంగా పరిగణిస్తున్నారు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత కూడా చాలామంది మానసిక అలసట, మందగించిన ఆలోచన, ఏకాగ్రత లోపం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్ ఫాగ్‌ను తగ్గించడానికి కొన్ని జీవనశైలి మార్పులు ఉపయోగపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం, భోజనం చేయడం వంటి క్రమబద్ధమైన అలవాట్లు మెదడుకు స్థిరత్వాన్ని ఇస్తాయి. రాత్రి వేళల్లో మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగాన్ని తగ్గించడం కూడా మంచిదని చెబుతున్నారు. నడక, యోగా, వ్యాయామం వంటి శారీరక చలనం మెదడుకు రక్తప్రసరణను మెరుగుపరచి ఆలోచనా సామర్థ్యాన్ని పెంచుతాయి. అలాగే పని మధ్యలో కొంత సమయం స్క్రీన్‌లకు దూరంగా ఉండటం వల్ల మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.

### హాబీలు పాటించాలి..

పుస్తకాలు చదవడం, తోటపని, సంగీతం, వంట, చిత్రలేఖనం వంటి ఆఫ్‌లైన్ హాబీలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిలో కొంత సమయం గడపడం, సూర్యకాంతి, స్వచ్ఛమైన గాలి తీసుకోవడం కూడా మెదడుకు ఉల్లాసాన్ని ఇస్తాయి. ధ్యానం, శ్వాసాభ్యాసాలు, మైండ్‌ఫుల్‌నెస్ పద్ధతులు ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంచడంలో సహాయపడతాయని సూచిస్తున్నారు. అయితే ఈ సమస్యలు తరచుగా ఎదురై రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తే వైద్యులను సంప్రదించడం అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# వేసవిలో తలనొప్పి సమస్య రోజు రోజుకీ ఎక్కువవుతుందా.. అందుకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

వేసవి వేడి రోజురోజుకీ పెరుగుతున్న కొద్దీ మైగ్రేన్ సమస్యతో బాధపడేవారిలో తలనొప్పి ఎక్కువవుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, డీహైడ్రేషన్, ఎండలో ఎక్కువసేపు తిరగడం, నిద్రలేమి వంటి కారణాలు మైగ్రేన్‌ను మరింత తీవ్రమయ్యేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని సాధారణ జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించడం ద్వారా మైగ్రేన్ దాడులను కొంతవరకు నియంత్రించవచ్చని సూచిస్తున్నారు. వేసవిలో మైగ్రేన్‌కు ప్రధాన కారణాలుగా భోజనం మానేయడం, సరైన నిద్ర లేకపోవడం, అధిక ఒత్తిడి, రాత్రివేళల్లో ఎక్కువసేపు మొబైల్ లేదా కంప్యూటర్ స్క్రీన్ చూడడం, ఎండలో ప్రయాణాలు చేయడం, ప్రాసెస్డ్, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వంటి అంశాలు ఉంటున్నాయి. కొంతమందిలో చాక్లెట్, చీజ్ వంటి ఆహారాలు కూడా ట్రిగ్గర్‌గా పనిచేస్తాయని చెబుతున్నారు.



### వేళకు భోజనం చేయాలి..

మైగ్రేన్ బాధితులు భోజన సమయాలను కచ్చితంగా పాటించడం చాలా ముఖ్యం. అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం ఒకే సమయాల్లో తీసుకోవడం మంచిది. భోజనం మానేయడం వల్ల తలనొప్పి ముదిరే అవకాశముంటుంది. శరీరంలో నీటి లోపం లేకుండా చూసుకోవడం కూడా అత్యంత అవసరం. రోజుకు కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలి. గుండె లేదా కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు నీటి పరిమాణాన్ని నిర్ణయించుకోవాలి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం మైగ్రేన్ నియంత్రణలో సహాయపడుతుంది. టోఫు, పనీర్, క్వినోవా, బాదం, పప్పులు, గుడ్లు, శనగలు, గ్రీక్ యోగర్ట్ వంటి పదార్థాలను ఆహారంలో చేర్చాలి. సాచ్యురేటెడ్, ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉండే ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్, డీప్ ఫ్రైడ్ ఫుడ్స్‌ను తగ్గించడం మంచిది. ఇవి మైగ్రేన్ దాడులను పెంచే అవకాశం ఉంటుంది.

### టీ, కాఫీలకు బదులు వీటిని సేవించాలి..

ఖాళీ కడుపుతో టీ లేదా కాఫీ తాగకూడదు. వీలైతే వాటి బదులుగా కొబ్బరి నీళ్లు తీసుకోవడం వల్ల శరీరానికి హైడ్రేషన్ లభిస్తుంది. రోజూ ఆరు నుంచి పది గుమ్మడి గింజలు తీసుకోవడం వల్ల కొంత ప్రయోజనం ఉంటుంది. అలాగే రోజుకు సుమారు 400 గ్రాముల పండ్లు, కూరగాయలు తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పండ్ల రసాల కంటే పూర్తి పండ్లనే తినడం మంచిది. అదనంగా చక్కెర కలిపిన శీతల పానీయాలు, ఎనర్జీ డ్రింక్స్, మద్యం వంటి వాటిని దూరంగా ఉంచాలి. అధిక చక్కెర కూడా మైగ్రేన్‌కు కారణమవుతుంది, అందుకే చాక్లెట్, చీజ్ వంటి పదార్థాలను పరిమితంగా తీసుకోవాలి.

### వ్యాయామం కూడా ముఖ్యమే..

ఆహారంతో పాటు వ్యాయామం కూడా మైగ్రేన్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. నడక, జాగింగ్, స్విమ్మింగ్, డ్యాన్స్, జుంబా వంటి శారీరక చలనం ఉన్న కార్యకలాపాలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మైగ్రేన్ లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని హెచ్చరిక సంకేతాలను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. తలనొప్పితో పాటు చూపు సమస్యలు, జ్వరం, మెడ బిగుసుకుపోవడం, కొత్తగా ప్రారంభమైన తీవ్రమైన తలనొప్పి, నడవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే న్యూరాలజిస్ట్‌ను సంప్రదించాలి. అలాగే వారానికి రెండు సార్లకు మించి తలనొప్పి వస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం.

# అధిక శాతం మందికి వస్తున్న కండరాల నష్టం, ఎముకల బలహీనత.. ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు..



దశాబ్దాలుగా వృద్ధాప్యం, కదలిక సామర్థ్యం, ఎముకలు విరిగే ప్రమాదాలపై జరిగిన చర్చల్లో ఎముకల ఆరోగ్యం ప్రధాన స్థానాన్ని ఆక్రమించింది. సాధారణంగా ఏర్పడే బోన్ మినరల్ డెన్సిటీ (దీవీణ) స్కాన్ల నుంచి ఆస్టియోపోరోసిస్‌పై విస్తృత అవగాహన వరకు ప్రధాన దృష్టి ఎముకల బలాన్ని కాపాడటంపైనే నిలిచింది. అయితే తాజా పరిశోధనలు ఈ దృక్పథం పూర్తిగా సరిపోదని సూచిస్తున్నాయి. ఇప్పుడు నిపుణులు తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే మరో అంశంపై దృష్టి సారిస్తున్నారు. వయస్సు పెరగడం వల్ల క్రమంగా కండరాల పరిమాణం, బలం తగ్గిపోవడం అనే అంశంపై వారు దృష్టిసారించారు. దీన్నే సార్కోపీనియాగా పిలుస్తున్నారు. దీని వల్ల అంగవైకల్యం, శస్త్రచికిత్స లోపాలు, మెటబాలిక్ సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతోందని, దీని ప్రభావాలు దీర్ఘకాలం పాటు ఉంటాయని అంటున్నారు. సమతుల్యత నుంచి కదలిక వరకు, పెద్ద శస్త్రచికిత్సల తర్వాత కోలుకునే సామర్థ్యం వరకు అన్నింటినీ ఇది ప్రభావితం చేస్తుందని చెబుతున్నారు.

### రెండూ ఒకే వ్యవస్థగా పనిచేస్తాయి..

ఆర్థోపెడిక్ నిపుణులు ఎముకలు, కండరాలు ఒకే వ్యవస్థగా పనిచేస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఎముకల సమస్యలను మాత్రమే చికిత్స చేయడం, కండరాల ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల కోలుకునే ప్రక్రియ పరిమితం అవుతుందని, సమస్యలు పెరిగే అవకాశాలు ఎక్కువవుతాయని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా, కూర్చునే జీవనశైలి సాధారణమవుతుండగా, కండరాల నష్టాన్ని ప్రారంభ దశలోనే ఎదుర్కోవడం స్వతంత్ర జీవనాన్ని కాపాడటానికి, పడిపోవడం నివారించడానికి, మొత్తం జీవన ప్రమాణాన్ని మెరుగుపరచడానికి అత్యంత సమర్థవంతమైన వ్యూహాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. కండరాల నష్టం ఎందుకు పెరుగుతున్న సమస్యగా మారుతోంది అనే అంశంపై ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ శువేందు ప్రసాద్ రాయ్ మాట్లాడుతూ ఆర్థోపెడిక్ సంరక్షణలో తాము సంప్రదాయంగా బ్రిక్స్.. అంటే ఎముకలు, సంధులపై దృష్టి పెట్టామని, ఆస్టియోపోరోసిస్‌ను నివారించేందుకు బోన్ మినరల్ డెన్సిటీని క్రమంగా పరిశీలిస్తూనే ఉన్నామని తెలిపారు. కానీ మార్టర్.. అంటే కండరాల వ్యవస్థను తరచూ నిర్లక్ష్యం చేస్తున్నామని అన్నారు.

### పట్టించుకోని అంశంగా మారింది..

సార్కోపీనియా అత్యంత ముఖ్యమైన వ్యాధి అని, కానీ పట్టించుకోని అంశంగా మారిందని తెలిపారు. ఇది శస్త్రచికిత్స ఫలితాలు, దీర్ఘకాలిక వైకల్యతను ముందుగా సూచించే సూచిక అని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔను) ప్రకారం వయస్సుతో వచ్చే కండరాల క్షీణత వృద్ధుల్లో బలహీనతకు, స్వతంత్ర జీవన నష్టానికి ప్రధాన కారణంగా నిలుస్తుందన్నారు. అధ్యయనాలు చెబుతున్నట్లుగా 30 ఏళ్ల తర్వాత ప్రతి దశాబ్దంలో 3 నుంచి 8 శాతం వరకు కండరాల పరిమాణం తగ్గుతుందని తెలిపారు. 60 ఏళ్ల తర్వాత ఈ తగ్గుదల మరింత వేగంగా జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న అవగాహన ప్రకారం ఆస్టియోపోరోసిస్, సార్కోపీనియా ఒకేసారి జరుగుతాయని, పరస్పరం ప్రభావితం చేస్తాయని తెలిపారు. కండరాలు ఎముకల బలాన్ని కాపాడడంలో ప్రత్యక్ష పాత్ర పోషిస్తాయని, కండరాలు ఎముకలకు అంటి ఉంటాయి కాబట్టి కండరాల బలం, వాటి క్రమమైన సంకోచం ఎముకలకు బలం, సాంద్రతను నిలుపుకోవడానికి నేరుగా ప్రేరణ ఇస్తుందని ఆయన వివరించారు.

### రెండింటికీ దగ్గరి సంబంధం..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ప్రకారం కండరాల పరిమాణం తగ్గడం ఎముకల సాంద్రత తగ్గడంతో దగ్గర సంబంధం కలిగి ఉందని తేలింది. ఇది ఎముకలు విరిగే ప్రమాదాన్ని పెంచుతుంది. ఈ రెండు పరిస్థితులు కలిసినప్పుడు దాన్ని ఆస్టియోసార్కోపీనియాగా పిలుస్తారు. ఎముకల ఆరోగ్యం ముఖ్యమైనదే అయినా శారీరక స్వతంత్రతకు కండరాలే ప్రధాన శక్తి యంత్రం అని డాక్టర్ రాయ్ చెప్పారు. కండరాల నాణ్యత తగ్గిపోవడం, ముఖ్యంగా వాటిలో కొవ్వు చేరడం వల్ల, సంధుల స్థిరత్వం తగ్గి కార్టిలేజ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. ఇది ఆస్టియోఆర్థ్రైటిస్ వంటి సమస్యలను వేగవంతం చేస్తుంది. యూరోపియన్ వర్కింగ్ గ్రూప్ ఆన్ సార్కోపీనియా ఇన్ ఓల్డర్ పీపుల్ ప్రకారం సార్కోపీనియాను కేవలం కండరాల పరిమాణంతో మాత్రమే కాకుండా, బలం, పనితీరు తగ్గుదలతో కూడా నిర్వచిస్తారు. ఇవే వైకల్యానికి బలమైన సూచికలు.

### కండరాలను బలంగా ఉంచుకోవాలి..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పెద్దలు వారానికి కనీసం రెండు రోజులపాటు కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయాలి. సరైన పోషణ, తగిన ప్రోటీన్, విటమిన్ డి తీసుకోవడం కండరాల ప్రోటీన్ సంశ్లేషణకు అత్యంత కీలకం. ముఖ్యంగా వృద్ధుల్లో సరిపడా ప్రోటీన్ తీసుకోవడం కండరాల నష్టాన్ని తగ్గించి బలాన్ని పెంచుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. కండరాల నష్టం ఇక వృద్ధాప్యానికి మాత్రమే సంబంధించిన సమస్య కాదు. ఇది కదలిక, స్వతంత్ర జీవనం, దీర్ఘకాలిక ఆరోగ్య ఫలితాలపై ప్రభావం చూపే ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. నిపుణులు హెచ్చరిస్తున్నట్లుగా ఎముకల ఆరోగ్యంపై మాత్రమే దృష్టి పెట్టడం ఫ్రాక్చర్లను నివారించడానికి లేదా శస్త్రచికిత్సల తర్వాత విజయవంతమైన జీవితానికి సరిపోదు. సార్కోపీనియాను ప్రారంభ దశలోనే గుర్తించి శక్తి వ్యాయామాలు, సరైన పోషణ, క్రమమైన అంచనాలను ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యక్తులు పడిపోవడం, ఎముకలు విరగడం, మెటబాలిక్ సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. కండరాల ఆరోగ్యాన్ని ఎముకల సాంద్రతతో సమానమైన క్లినికల్ ప్రాముఖ్యతగా భావిస్తే కేవలం శరీర నిర్మాణాన్ని మరమ్మత్తు చేయడం మాత్రమే కాదు, దాన్ని కదిలించే శక్తిని కూడా సంరక్షిస్తున్నట్లే అని డాక్టర్ రాయ్ తేల్చి చెప్పారు.

## ఐబీఎస్ సమస్య ఉన్నవారు ఈ ఆహారాలను తీసుకోవాలి..
# జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తాయి..



ఇర్రిటబుల్ బోవెల్ సింద్రోమ్ (ఐబీఎస్)తో జీవించడం చాలా మందికి అసౌకర్యంగా, అంచనా వేయలేని పరిస్థితిలా అనిపిస్తుంది. ఇది పెద్ద పేగును ప్రభావితం చేసే సాధారణ జీర్ణ సమస్య. సాధారణంగా పొట్ట ఉబ్బరం, కడుపు నొప్పి, గ్యాస్, విరేచనాలు లేదా మలబద్ధకం వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుంది. ఐబీఎస్‌కు కచ్చితమైన కారణం ఇంకా పూర్తిగా తెలియకపోయినా ఒత్తిడి, గట్ (జీర్ణాశయం) సెన్సిటివిటీ, కొన్ని ఆహారాలు ఈ సమస్యను మరింత పెంచే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యను నియంత్రించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. సరైన ఆహారాలను ఎంపిక చేసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను శాంతింపజేయడంతోపాటు వాపులను తగ్గించవచ్చు. ఐబీఎస్‌తో బాధపడేవారు తమ ఆహారంలో చేర్చుకోవాల్సిన కొన్ని ఆహారాల గురించి కూడా నిపుణులు సూచిస్తున్నారు.

### గ్రీన్ కివి..

ఐబీఎస్ అనేది కేవలం కొన్ని ఆహారాలను దూరం పెట్టడం మాత్రమే కాదు. సరైన ఫైబర్, పోషకాలు ఉన్న ఆహారాలు జీర్ణక్రియను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. కొన్ని ఆహారాలు మల నిర్మాణాన్ని మెరుగుపరచడం, గట్ మజిల్స్‌ను శాంతింపజేయడం, మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహించడం వంటి విధంగా పనిచేస్తాయి. ఐబీఎస్ తో బాధపడే వారు తమ ఆహారంలో చేర్చుకోవాల్సిన కొన్ని ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఐబీఎస్ నియంత్రణకు గ్రీన్ కివీ పండు మంచి ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు రెండు కివీ పండ్లు తినడం వల్ల మల విసర్జన మెరుగుపడటం, మలం మృదువుగా మారడం, పొట్టలో అసౌకర్యం తగ్గడం జరుగుతుంది. ఇందులో ఉన్న సాల్యుబుల్ ఫైబర్ జీర్ణక్రియను సాఫీగా కొనసాగించడంలో సహాయపడుతుంది.

### పెప్పర్‌మింట్ ఆయిల్, ఓట్స్..

పెప్పర్‌మింట్ ఆయిల్ కూడా ఐబీఎస్ లక్షణాలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ఇది యాంటీ స్పాస్మోడిక్‌గా పనిచేసి కడుపు నొప్పి, బ్లోటింగ్‌ను తగ్గిస్తుంది. గట్‌లోని మజిల్స్‌ను రిలాక్స్ చేసి క్రమంగా జీర్ణ సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. పార్టియల్లీ హైడ్రోలైజ్డ్ గ్వార్ గమ్ (PHGG) అనే సహజ ఫైబర్ సప్లిమెంట్ కూడా జీర్ణక్రియను సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ప్రీబయోటిక్‌గా పనిచేసి గట్‌లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఇతర ఫైబర్‌లతో పోలిస్తే గ్యాస్ సమస్య తక్కువగా ఉండేలా ఇది సహాయపడుతుంది. ఓట్స్ కూడా సులభంగా జీర్ణమయ్యే సాల్యుబుల్ ఫైబర్ మూలంగా పనిచేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఐబీఎస్ లక్షణాలు కొంతవరకు నియంత్రణలో ఉంటాయి.

### గ్రీన్ బనానా ఫ్లోర్..

గ్రీన్ బనానా ఫ్లోర్ (పచ్చ అరటి పిండి)లో రెసిస్టెంట్ స్టార్చ్ అధికంగా ఉంటుంది. ఇది గట్‌లో మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేస్తూ పొట్ట లోపలి పొర ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కొంతమంది దీన్ని గోధుమ పిండి స్థానంలో కూడా ఉపయోగిస్తుంటారు. గట్ ఆరోగ్యం కోసం ఆహారాలను పూర్తిగా తొలగించడం కాకుండా, సరైన ఆహారాలను సరైన మోతాదులో చేర్చుకోవడం ముఖ్యం. ఒక్కొక్కరి శరీర స్పందన ఒక్కోలా ఉంటుంది కనుక ఐబీఎస్ ఉన్నవారు కొత్త ఫైబర్ ఆహారాలను మెల్లగా, ఒక్కోటి చొప్పున ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# ఒత్తిడి అధికంగా ఉంటే ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకున్నా వృథాయే.. ఏం చేయాలంటే..?

కాంబుచా తాగుతున్నారా, ప్రోబయోటిక్స్ తీసుకుంటున్నారా, గట్ (జీర్ణవ్యవస్థ)కు మంచిదని చెప్పే పర్ఫెక్ట్ డైట్ పాటిస్తున్నారా.. అయినా పొట్ట ఉబ్బరం తగ్గడంలేదా? అయితే దీనికి కారణం ఒత్తిడి కావచ్చని వైద్యులు చెబుతున్నారు. సలాడ్లు తిన్నా, కాంబుచా తాగినా, ప్రోబయోటిక్స్ తీసుకున్నా, ఒత్తిడిలో ఉంటే కడుపు ఉబ్బరం సమస్య తలెత్తే అవకాశం ఉంది. కాంబుచా అనేది గ్యాస్ కలిగిన ప్రోబయోటిక్ పానీయం. ఇది గట్‌లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. అయితే ఒత్తిడి సమయంలో శరీరం సర్వైవల్ మోడ్ లోకి వెళ్లిపోతుంది. దీని ప్రభావంగా జీర్ణక్రియ మందగిస్తుంది.

### ఒత్తిడిలో ఉన్నప్పుడు జరిగేది ఇదే..

మనిషి స్ట్రెస్‌లో ఉన్నప్పుడు రక్తప్రసరణ పొట్ట నుంచి ఇతర అవయవాల వైపు మళ్లుతుంది. జీర్ణక్రియ ఎంజైమ్స్ పనితీరు తగ్గిపోతుంది, పొట్టలో ఆమ్లం స్థాయి పడిపోతుంది. ఫలితంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకున్నా అది పొట్టలో సరిగ్గా జీర్ణం కాకుండా ఉండిపోతుంది. దీంతో బ్లోటింగ్ (కడుపు ఉబ్బరం), అసిడిటీ, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. ఇలా నిరంతరం బ్లోటింగ్, అసిడిటీ, గ్యాస్ సమస్యలు కొనసాగితే దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల ఇర్రిటబుల్ బావెల్ సింద్రోమ్ (ఐబీఎస్), గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ వ్యాధి వంటి జీర్ణ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. అంతేకాకుండా గట్ ఆరోగ్యం కేవలం ఆహారంపై మాత్రమే ఆధారపడదని నాడీ వ్యవస్థపై కూడా ఆధారపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణక్రియ మెరుగుపడేందుకు నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచడం కూడా కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

### రెస్ట్ అండ్ డైజెస్ట్ మోడ్‌ను యాక్టివేట్ చేయండిలా..

భోజనం ప్రారంభించే ముందు ప్రశాంతంగా ఉండటం ఎంతో ముఖ్యం. భోజనం చేసే ముందు 3 నుంచి 5 సార్లు నెమ్మదిగా లోతైన శ్వాసలు తీసుకోవడం ద్వారా రెస్ట్ అండ్ డైజెస్ట్ మోడ్ యాక్టివ్ అవుతుంది. దీని వల్ల పొట్టలో ఆమ్లం, ఎంజైమ్స్ విడుదల మెరుగుపడుతుంది. మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం కూడా ఉపయోగకరం. ఇవి నర్వస్ సిస్టమ్‌ను రిలాక్స్ చేయడంలో సహాయపడతాయి. గుమ్మడి గింజలు, బాదం, పాలకూర, అరటిపండ్లు, డార్క్ చాక్లెట్ వంటి పదార్థాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల తగినంత మెగ్నీషియం అంది నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. అలాగే అల్లం, కామొమైల్, సోంపు, పుదీనా వంటి హెర్బల్ టీలు తాగడం ద్వారా గట్ మాత్రమే కాదు, నర్వస్ సిస్టమ్ కూడా ప్రశాంతంగా ఉంటుంది.

### నెమ్మదిగా తినాలి..

ఇక భోజనం వేగంగా చేయడం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒత్తిడిలో త్వరగా తినడం బ్లోటింగ్‌ను మరింత పెంచుతుంది. అందుకే నెమ్మదిగా నములుతూ తినడం అలవాటు చేసుకోవాలి. రక్తంలో షుగర్ స్థాయిలను స్థిరంగా ఉంచడం కూడా స్ట్రెస్ తగ్గించడంలో కీలకం. ప్రతి భోజనంలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకర కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. ఇక రోజుకు కనీసం ఐదు నిమిషాల పాటు లోతైన శ్వాసాభ్యాసం, చిన్న వాకింగ్ లేదా సూర్యకాంతి పొందడం కూడా గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. గట్ హెల్త్ అనేది కేవలం ప్లేట్‌లో ఏముంది అనేదానిపై మాత్రమే ఆధారపడదు. నర్వస్ సిస్టమ్ స్థితి కూడా అంతే ముఖ్యమైనది. జీర్ణక్రియ ఎప్పుడూ ప్రశాంత పరిస్థితుల్లోనే బాగా పనిచేస్తుంది, తొందరపాటు, ఒత్తిడిలో కాదని నిపుణులు తెలియజేస్తున్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com